


ఆయాసంతో వగరుస్తూ వచ్చిన హిమ బిందుకు దూరంగా కనిపించేడతను.

"ప్లీజ్! ఒక సాయం చెయ్యరూ, అయిదు రూపాయిలిస్తాను" అన్నాడు హిమ బిందు బస్ కోసం వెయిట్ చేస్తున్న అతన్ని సమీపించి.

అయిదు పైసలన్నా వున్నాయో లేవో అన్నట్టుగా హిమబిందు మాటల్లో కొట్టొచ్చినట్టున్న సిప్పియారిటీని గమనించి "ఏం చెయ్యాలి?" అనడిగేడతను.

"నేను మీకు రెండొందలు బాకీ పడినట్టు పేచీ పెట్టండి. ఇదిగో ఈ పొరుగునే మా ఇల్లు. తాగుతానని నిన్నవే నా నెలజీతం మా ఆవిడ అందుకుంది. నా అవసరాలూ, అప్పులు నాకుంటాయి. ఆ విషయం ఎంత చెప్పినా నమ్మరు. కాబట్టే ప్రతి నెలా ఇలా ఎవరో ఒకర్ని పట్టుక్కొని..."

*　　*　　*　　*

ఆ ముగ్గురి చూపులూ సూదుల్లా గుచ్చుకుంటుంటే మౌనంగా తల దించుకున్నాడు హిమ బిందు.

పేరులో వున్న సౌందర్యం తీరులో మచ్చుకైనా కనిపించని అతను తాలూకా ఆఫీసులో గుమస్తా. ఇంటా బయటా ఒకేలాంటి వునికి అతనికి.

అతను విడిచి వెళ్ళిన చోట సారాయి వాసనలు గిరికీలు కొడుతుంటాయి. అతను నడిచి వెళ్ళిన బాట సారాయి సౌరభాలు వెదజల్లుతుంటాయి.

అప్పటిదాకా నెల జీతమే ఎగవేస్తున్నాడనుకున్న భర్త ప్రావిడెంట్ ఫండూ, స్పెషల్ అలవెన్సులే కాక లోన్లు కూడా కాజేశాడని తెలియడంతో ఇల్లు కదలని ఆ ఇల్లాలు దొరగారితో మొర పెట్టుక్కొని బ్యాంకు ద్వారా నెల జీతాన్ని తనే అందుకునే సదుపాయం వేజిక్కించుకుంది గత కొద్ది మాసా లుగా.

దాంతో గుంజాటనలో పడిపోయేడు హిమ బిందు. చేతిలో పుష్కలంగా డబ్బు ఆడక పోవడం వల్ల కొంపలోని వస్తువులు క్రమంగా మాయం కాసాగేయి. "మీ నాన్న మొన్న స్టీలుగ్లాసు అమ్ముతూ కనిపించేడ్రా"

తల కొట్టేసినంత పనయింది శేఖరానికి.

"మీ నాన్నేమిటి? పట్టుచీర పట్టుకు తిరుగుతున్నాడు"

కాలవలో దూకి చావాలనిపించింది గౌరికి.

*　　*　　*　　*

తండ్రి ఆగడాలు మితి మీరడంతో విసుగెత్తిన శేఖరం ఆ సాయంత్రం అతన్ని వెంబడించాడు.

ఇంటి నుండి పైకొచ్చిన హిమబిందు వడివడిగా పది నిముషాల్లో ఓల్డ్ మార్కెట్ చేరుకున్నాడు. ఆ ఓల్డ్ మార్కెట్‌లోను, దానికి కొద్ది దూరంలో వున్న న్యూ మార్కెట్‌లోను కేవలం పుస్తకాలే అమ్ముడవుతుంటాయి.

మేఘాల పరదాల వెనుక నుంచి తొంగి చూసే చందమామల్లాంటి పుస్తకాలు న్యూ మార్కెట్లో వుంటే, చిక్కి శల్యమై జవాలుడిగి పోతున్నట్లుండే పుస్తకాలు ఓల్డ్ మార్కెట్లో వుంటాయి.

షాపుల ముందు నుండి వెళుతున్న హిమ బిందుని పిచ్చివాడ్ని పట్టుకున్నట్టు పట్టుక్కొని పీక్కు తింటున్నారు షాపుల్లో పనిచేసే కుర్రాళ్ళు.

"రెండున్నాయ్ సార్"

"ఆరున్నాయ్ సార్"

"ఒకటిన్నర"

చివరి మాట అన్నవాడి కేసి అప్రతిభుడైనట్టు చూశాడు హిమబిందు.

"అంటే?"

"వెనుక పేజీలూడిపోయాయి"

మార్కెట్‌లో అడుగు పెట్టిన గంటన్నరకి పెద్ద గోనె మూటతో పైకొచ్చిన హిమబిందును చూసి ఉలిక్కిపడ్డాడు శేఖర్.

కాసేపట్లో అక్కడ గుంపుగా వున్న రిక్షాలోని ఓ రిక్షా కదిలి పైకొచ్చింది. దాన్లో గోనె మూట, హిమబిందు. దానికి కొద్ది దూరంలో వగరుస్తూ వెంబడిస్తున్న శేఖర్.

మధ్యలో ఒక చోట రిక్షా దిగి రోడ్డు వారే వున్న తడికల చాటుకి వెళ్ళాడు హిమబిందు. అక్కడ ఓ పావలా ఇచ్చి వేలెడంత సీసాలో సారాయి పోయించుకుంటుంటే విస్తుపోయాడు శేఖరు.

కాసేపట్లో రిక్షా గాంధీనగరం నాల్గవ వీథి చివరింటి గోడకి ఆనించికట్టిన షెడ్ ముందాగింది.

"కొంపతీసి నాన్నగారి చిన్నిల్లా ఇది?"

ఉలిక్కిపడిన శేఖరం తెరచి వున్న షెడ్ వెంటిలేషన్ గుండా లోపలికి చూసి అవాక్కయేడు.

లోపల గుట్టలు గుట్టలుగా పుస్తకాలున్నాయి.

వాటిలో ఒక పుస్తకాన్ని అందుకొని, మృదువుగా ఒక్కొక్క పేజీ తెరచి చూసేడు. తరువాత మరొకటి, ఆ తరువాత ఇంకొకటి.

ఇలా ఓ అరగంట గడిచేక జేబులోంచి సీసా తీసి, దాన్లో వున్న ద్రవాన్ని మొహంమీద జల్లుకొని లాల్చీతో తుడుచుకొని షెడ్ పైకొచ్చేడు.

అతను పైకొచ్చి కంటికి కనిపించనంత దూరం పోయేక షెడ్‌లో అడుగు పెట్టిన శేఖర్ ఆ గుట్టలోంచి ఒక పుస్తకాన్ని పైకి తీశాడు.

'ఆత్మావలోకనం'- 'హిమబిందు'

మరొకటి తీస్తే అదీ అదే.

పదేళ్ళ క్రితం తండ్రి రాసిన నవల.

బియ్యంలో పప్పు గింజల్లా ఆ 'ఆత్మావలోకనా'ల కుప్పల్ని కెలుకుతుంటే- 'రంగు పొంగు', 'సెగడ్డ'లు ఎన్నో కనిపించేయి. అవన్నీ అయిదారేళ్ళ క్రితం హిమబిందు రాసినవే.

ఆ పుస్తకాల పేజీలను కొరికి ఆకలి తీర్చుకుంటున్న కోట్లాది పురుగులు మెదడుకి పట్టిన 'చెద'ని దులుపుతున్నట్టనిపించింది శేఖరానికి.

